



# రాణాలో వసూల్ రాజా..!

- ధర్మవరం సబ్ డివిజన్‌లో ఓ రైటర్ వసూళ్ల పర్వం
- అధికారులను గుప్పిట్లో పెట్టుకుని తంతు
- ప్రతి పనికీ ఓ రేటు
- నెల ఆదాయం రూ.20లక్షల పైమాటే



**పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి**

ధర్మవరం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఓ రైటర్ వసూల్ రాజా అవతారమెత్తాడన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రతి పనికీ ఓ రేటు పెట్టి వసూలు చేస్తుండటంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు. నిత్యం పంచాయితీల్లో మునిగి తేలుతున్నారన్న చర్చ పోలీసు వర్గాల్లోనే సాగుతోంది. పైఅధికారులను సైతం గుప్పిట్లో పెట్టుకున్నాడన్న విమర్శలున్నాయి. దీంతో అధికారులు కూడా ఆ రైటర్‌ను వెనుకేసుకు రావడమే కాకుండా ప్రోత్సహిస్తున్నారన్న చర్చ సాగుతోంది. ఆ రైటర్ మాటను ఎవరైనా జవదాటితే వారికి ఛీత్కారాలు, పనిష్‌మెంట్లు తప్పవట. పైస్థాయి అధికారికి ఇష్టమైన విందు భోజనాలతో పాటు నూతన ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సామగ్రిని సైతం ఆ రైటర్ తన పలుకుబడిని ఉపయోగించి సమకూరుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ రైటర్ నెలాదాయం రూ.20 లక్షలుపై మాటేనని పోలీసు శాఖ కోడై కూస్తోంది. ఓ స్థానికేతరుడి ద్వారా వసూళ్ల చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

## భారీగా వసూళ్లు

రైటర్ స్టేషన్‌లో విధులు మరచి వసూల్ రాజాగా మారిపోయారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. తన చేతికి అవినీతి మట్టి అంటకుండా బయటి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని అసిస్టెంట్‌గా ఏర్పాటు చేసుకుని, అతడి ద్వారా వసూళ్ల చేస్తున్నట్లు తెలుస్తోంది. సివిల్ పంచాయితీల నుంచి రాళ్ల ట్రాక్టర్ల వరకు ఎవ్వరినీ ఉపేక్షించరు. అందరూ కప్పం కట్టాల్సిందే. లేదంటే పోలీసుశాఖ ట్రీట్‌మెంట్ రుచి చూపిస్తారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఇన్నాళ్లు వైసీపీతో అంటకాగిన ఆ రైటర్ టీడీపీ వర్గీయులను ఇబ్బందులను పెట్టడమే పనిగా పెట్టుకున్నారన్న వాదనలు రాజకీయ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ హత్య కేసులో ఒకరి నుంచి రూ.1.50లక్షలు, మరొకరి నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేసినట్లు బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఆ ప్రాంతంలో తిరిగే మినీ బస్సులు నెలవారీ రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు ముట్టజెప్పాల్సిందేనట. పశువులను తరలించే లారీల నుంచి నెలకు రూ.50 వేలు, ఆ పోలీసు స్టేషన్ పరిధిలో రైతు పొలాల్లో బోరు వేస్తే బోర్‌వెల్ యజమానిగానీ, రైతుగానీ రూ.10వేలు చొప్పున సమర్పించుకోవాల్సిందేనట. ఈ బోర్‌వెల్‌లో పనిచేయడానికి భద్రాచలం నుంచి ఏజెన్సీ ద్వారా కూలీలను ఇక్కడికి పంపుతుంటారు. ఓ బోర్‌వెల్ యజమాని.. కూలీలకు డబ్బు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో ఏజెన్సీ నిర్వాహకులు.. పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఆ రైటరే పంచాయితీ చేసి, రూ.1.50 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారని తెలుస్తోంది. చెప్పిన ప్రకారం బోర్‌వెల్ యజమాని స్టేషన్‌లోని రైటర్‌కు ఆ డబ్బు ముట్టజెప్పినట్టు తెలుస్తోంది. ఆ సదరు మొత్తాన్ని ఏజెన్సీ నిర్వాహకులకు ఇవ్వకుండా రైటర్ తీవ్ర ఇబ్బందులు పెట్టారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఆ పోలీసు స్టేషన్ పరిధిలో రాళ్ల కొట్టుకుని, జీవించేవారు అధికంగా ఉన్నారు. వారు రాయి తరలించాలన్నా ట్రాక్టర్ లెక్కన మామూలు ముట్టజెప్పాల్సిందేనట. ఇలా అక్రమార్జనలో తనకు ఎవరూ సాటి రారనే స్థాయిలో ఆ రైటర్ వ్యవహరిస్తుండడం శోచనీయం. స్టేషన్ పరిధిలోని ధాబాల నుంచి నెలకు రూ.10వేలు చొప్పున మామూలు ముట్టజెప్పాల్సిందేనట. రోజూ విందు భోజనాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ అధికారి నివాసముండే అనంతపురానికి సైతం పార్శిల్ పంపించాల్సి ఉంటుందని బాధిత వర్గాలు వాపోతున్నాయి. ఆ ప్రాంతంలోని టోల్‌గేట్ నుంచి సైతం ప్రతినెలా ఒకటో తేదీన రూ.30వేలు కవర్‌లో పెట్టి పంపించాల్సిందే. సదరు అధికారి ఇటీవల కర్నూలు జిల్లాలో ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు తెలుస్తోంది. అందుకు అవసరమయ్యే సామగ్రిని బెదిరించి తీసుకోవడమేకాకుండా వాటిని తరలించేందుకు కూడా వాహనదారులను వేధించినట్లు చర్చ సాగుతోంది.

## నిత్యం సివిల్ పంచాయితీలు

సివిల్ కేసులపై పోలీసు స్టేషన్‌ను ఆశ్రయిస్తే ఆ రైటర్ చుక్కలు చూపుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. సమస్యను నాన్చుతూ బాధితులకు మానసిక క్షోభ పెడుతున్నారన్న ఆరోపణలు ఆశాఖ నుంచే వినిపిస్తున్నాయి. టీడీపీ నాయకులపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ అధికారి వెంటనే స్పందిస్తారట. ఆగమేఘాలపై వారిని తీసుకొచ్చి, ఇబ్బందులు పెడుతారని సర్వత్రా చర్చ సాగుతోంది. సివిల్ పంచాయితీలను తెంచకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తుండడంతో ఒక్కోరోజు బాధితులతో పోలీసు స్టేషన్ కిటకిటలాడుతోందని స్థానికులు చెబుతున్నారు. సివిల్ పంచాయితీల్లో ఆ రైటర్ తీరుతో బాధితులు బెంబేలెత్తుతున్నారని తెలుస్తోంది. ఆర్థికంగా ఏస్థాయిలో ఇబ్బందులు పెడుతున్నారో బయటకు చెప్పుకోలేక కొందరు లోలోపల ఆందోళన చెందుతున్నారంటే ఆయన తీరు అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వసూల్ రాజాపై చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు వెనకేసుకొస్తుండడంతో వారి తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.



ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు గజమాలతో సత్కారం

# మీ రుణం తీర్చుకోలేనిది

- పార్టీ విజయం.. ఎన్టీఆర్‌కు అంకితం
- ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ
- పురంలో భారీఎత్తున జన్మదిన వేడుకలు



బాలయ్యను సన్మానిస్తున్న అభిమానులు

**హిందూపురం, జూన్ 10:** తనను ఎమ్మెల్యేగా గెలిపించిన హిందూపురం ప్రజల రుణం జన్మలో తీర్చుకోలేనిదని నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన 64వ పుట్టినరోజును సోమవారం పట్టణంలో మొదటిసారిగా టీడీపీ నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఉదయం టీడీపీ సెంటిమెంట్‌గా భావించే సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బాలకృష్ణకు పురోహితులు ఆశీస్సులు అందించారు. అనంతరం తన నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నాయకులు, అభిమానులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకుడు మంగేష్ భారీ గజమాలను క్రేన్ ద్వారా వేశారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్టాండుకు చేరుకుని, అక్కడ ఆర్టీసీ ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొని, ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆరోగ్య రథాన్ని పునఃప్రారంభించారు. తొలుత తానే ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించారు. డీఆర్ కాలనీలో అష్టలక్ష్మీ గుడివద్ద మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రావిళ్ల లక్ష్మీ, నాగరాజు భారీ గజమాలతో బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. అక్కడి నుంచి జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌కు చేరుకుని, అక్కడ ఎన్‌బీకే ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 64 కేజీల కేక్‌ను కట్‌చేశారు. ఎమ్మెల్యేకు జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో రోజంతా బాలయ్య పుట్టినరోజు వేడుకల సందడి కనిపించింది.

# రాజీనామాల పర్వం

**గోరంట్ల, జూన్ 10:** స్థానిక ఏడీసీసీ బ్యాంకు పరిధిలోని ఏడు సహకార సంఘాల చైర్మెన్ తమ పదవులకు సోమవారం రాజీనామా చేశారు. మండలంలోని గోరంట్ల సహకార సంఘం చైర్‌పర్సన్ శివశంకర్‌రెడ్డి, వానవోలు రాజేంద్రప్రసాద్, బూదిలి రఘురావిరెడ్డి, గౌనివారిపల్లి బయపరెడ్డి, పాలసముద్రం పాటూరి శంకర్‌రెడ్డి, చిలమత్తూరు మండలంలోని సోమగట్ట అమరప్ప, కోడూరు సహకార సంఘం చైర్‌పర్సన్ హనుమంతురెడ్డి రాజీనామా చేసినవారిలో ఉన్నారు. వీరితోపాటు ఒక్కో సహకార సంఘంలోని ఇద్దరు పర్సన్లుగా వ్యవహరిస్తున్నవారు రాజీనామా చేశారు. హిందూపురం డివిజనల్ సహకార సంఘం అధికారికి రాజీనామాలను అందజేశారు.

# కదిరి వైసీపీలో క్యాంపు రాజకీయం

బెంగళూరుకు కౌన్సిలర్ల తరలింపు





కదిరి మునిసిపల్ కార్యాలయం

**కదిరి, జూన్ 10:** సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభంజనం సృష్టించడం, కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ గెలుపొందడంతో వైసీపీలో గుబులు పట్టుకుంది. మున్సిపల్ చైర్మన్ సీటుకు గండం ఏర్పడే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. దీంతో క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. కదిరి మున్సిపాలిటీలోని పలువురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీకి టచ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉన్న కొంతమంది కౌన్సిలర్లను హుటాహుటిన బెంగళూరుకు తరలించినట్లు సమాచారం. ఓడిపోయిన వైసీపీ అభ్యర్థి మగ్బుల్ వద్దకు కౌన్సిలర్లను తీసుకెళ్లినట్లు సమాచారం. తామంతా ఐక్యంగా ఉన్నామని చెప్పించడానికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం తరువాత ఎలాంటి పరిణామాలు ఉంటాయోనని బెంగళూరుకు వెళ్లినట్లు సమాచారం. మునిసిపల్ చైర్మన్ చాంబర్‌కు ఇప్పటికే కమిషనర్ తాళాలు వేశారు. చైర్‌పర్సన్ వచ్చినపుడు మాత్రమే తాళాలు తీస్తామని చెబుతున్నారు. మున్సిపల్ కమిషనర్ వద్ద తాళాలుంటాయని చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎలాంటి పరిణామాలుంటాయోనని పట్టణంలో చర్చ సాగుతోంది.

# ఆశల పల్లకిలో..!

- అమాత్యయోగంపై సర్వత్రా ఉత్కంఠ
- తమకే వస్తుందంటున్న కూటమి ఎమ్మెల్యేలు
- అందరిలోనూ ఆశాభావం
- ఎవరి లెక్కలు వారివే..



**పుట్టపర్తి, జూన్10(ఆంధ్రజ్యోతి):** సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో జిల్లాలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి క్లీన్ స్వీప్ చేసి, రికార్డు సృష్టించింది. ఏడుచోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. వీరిలో టీడీపీ తరపున ఆరుగురు, ఒకచోట బీజేపీ అభ్యర్థి గెలుపొందారు. ఈనేపథ్యంలో కొత్తగా ఏర్పాటయ్యే మంత్రివర్గంలో జిల్లాలో ఎంత మందికి అవకాశం వస్తుంది, ఆభాగ్యం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తిగా మారింది. గెలుపొందిన ఎమ్మెల్యేల్లో సీనియారిటీ ఉందని కొందరు, సామాజిక సమీకరణాలు, మిత్రధర్మంలో తమకు మంత్రి పదవి లభిస్తుందని మరికొందరు లెక్కలు వేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో కొత్త ప్రభుత్వంలో మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఆయా నియోజకవర్గాల్లో కూటమి శ్రేణులు ఎదురు చూస్తున్నాయి. జిల్లాలో కూటమి క్లీన్‌స్వీప్‌తో గెలిచిన ఎమ్మెల్యేలు ఎవరికి వారుగా ఈసారి మంత్రి పదవి వస్తుందన్న ధీమాలో ఉన్నారు.

## సామాజిక సమీకరణాలే కీలకం

టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వారసుడిగా నందమూరి కుటుంబం నుంచి హిందూపురంలో హ్యాట్రిక్ సాధించిన నందమూరి బాలకృష్ణ కోరుకుంటే మంత్రి వర్గంలో చోటు సంపాదించే వారిలో మొదటి వరుసలో ఉంటారు. బాలకృష్ణ మంత్రి పదవి తీసుకుంటారనేది ఆయన ఎక్కడా బయటపడలేదు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది 2014లో మంత్రిగా పనిచేసిన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను మంత్రి వర్గంలోకి తీసుకునే అవకాశం ఉన్నా.. ఉమ్మడి జిల్లాలో మంత్రివర్గం కూర్పులో వివిధ అంశాలతోపాటు సామాజిక సమీకణాలు కీలకం కానున్నాయి. టీడీపీలో ఆ తర్వాతి స్థానంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు మంత్రి పదవి లభించే అవకాశం ఉంది. జిల్లాలో పెనుకొండ, మడకశిర, ధర్మవరం, పుట్టపర్తి నుంచి కూటమి తరపున ముగ్గురు ఎమ్మెల్యేలు తొలిసారి గెలుపొందారు. ధర్మవరం నుంచి బీజేపీ తరపున గెలుపొందిన సత్యకుమార్ యాదవ్‌కు మిత్రధర్మం కోటాలో అమాత్యపదవి లభించే అవకాశం ఎక్కువగా ఉందన్న చర్చ వినిపిస్తోంది. బీసీ మహిళ కోటా కింద వస్తే పెనుకొండ నుంచి టీడీపీ తరపున గెలుపొందిన సవితకు అవకాశం వస్తుందన్న లెక్కలు వేస్తున్నారు. పుట్టపర్తి నుంచి టీడీపీ తరపున ఎన్నికైన పల్లె సింధూరారెడ్డి, మడకశిర నుంచి గెలిచిన ఎంఎస్ రాజుకు సామాజిక సమీకరణాల్లో భాగంగా అమాత్య పదవి వరిస్తుందని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 14 స్థానాల్లో కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేశారు. అనంత జిల్లాలో మంత్రి పదవి లభించే దానిని బట్టి శ్రీసత్యసాయి జిల్లాలో ఎవరన్నది తేలనుంది. జిల్లాలో సీనియర్లతోపాటు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరూ అమాత్య పదవి ఆశిస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలకు వస్తుందా, మిత్రధర్మంలో బీజేపీకి సర్దుబాటు చేస్తారా అనేది 12వ తేదీన తేలనుంది.

# గుండెల్లో బడి గంట..!

- భయపెడుతున్న విద్యాసంవత్సరం
- పెరిగిన ఫీజులు, పుస్తకాల ధరలు
- భారమవుతున్న ప్రైవేటు, కార్పొరేట్ చదువులు
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన

**ధర్మవరం, జూన్ 10:** విద్యా సంవత్సరం ఏటా జూన్‌లో ప్రారంభమవుతుంది. ఈ నెల వచ్చిందంటే విద్యార్థుల తల్లిదండ్రులకు దడ పుడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు చదువుకొనాల్సి వస్తోంది. నర్సరీ కోసం ఒక్కో విద్యార్థికి ఫీజులు, పుస్తకాలు ఇతర ఖర్చులు కనీసం రూ.50వేలు అవుతోంది. దీంతో ఉన్నత విద్య కన్నా ప్రాథమిక విద్య సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు నమ్మకం లేకపోవడంతో భారమని తెలిసినా ప్రైవేటువైపు మొగ్గు చూపుతున్నారు. ఫీజుల నియంత్రణపై పట్టించుకోవాల్సిన విద్యాశాఖ నిద్రమత్తులో జోగుతోంది. దీంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా ఒకటో తేదీ అంటే ప్రతి వర్గంలోనూ ఆందోళన వెంటాడుతుంది. పాలు, ఇంటి అద్దె, కరెంటు, కేబుల్ బిల్లు అన్నీ చెల్లించాల్సి ఉంటుంది. జూన్ నెలలో వీటికి అదనంగా విద్యార్థుల చదువుల భారం పడుతుంది. పిల్లలను పాఠశాలలో చేర్చడం, వారి ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు తదితర ఖర్చులు అధికం. అందుకే జూన్ వచ్చిందంటే సామాన్య, మధ్యతరగతి ప్రజల గుండెల్లో దడ పుడుతుంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు గతేడాది కన్నా పెంచేశారు. కొన్ని యాజమాన్యాలు నర్సరీ నుంచే అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. అడ్మిషన్ ఫీజే రూ.5 వేల వరకు పిండుకుంటున్నాయి. పుస్తకాలకు వేలల్లో ఇచ్చుకోవాల్సిందే. వీటితోపాటు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, యూనిఫాం, షూ ఇతర ఖర్చులు అదనం. దూరాన్ని బట్టి ట్రాన్స్‌పోర్ట్ చార్జీ ఏడాదికి రూ.8వేల నుంచి 15వేల వరకు అవుతోంది. దీంతో మొత్తంగా నర్సరీ విద్యార్థిని చదివించాలంటే దాదాపు రూ.50వేలు ఖర్చవుతోంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



## ప్రభుత్వ విద్య బలోపేతమేదీ..?

వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరిట ఆర్భాటాలు చేసిందే తప్ప.. విద్యకు సంబంధించి ప్రోత్సాహకాలు మాత్రం పెంచలేదన్నది నిర్వివాదాంశం. అసంబద్ధ నిర్ణయాలతో పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసిందన్నది అన్నివర్గాల నుంచి వినిపిస్తున్న విమర్శం. వైసీపీ ప్రభుత్వం కుటుంబంలో ఒక విద్యార్థికి రూ.13 వేలు చొప్పున చెల్లించేది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీతో తమపై అదనపు భారం పడేదని సామాన్య, మధ్యతరగతి ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. వసతులు పెరిగాయి. ఆ ఆనందం ఎన్నో రోజులు నిలువలేదు. పాఠశాలల సర్దుబాటు పేరిట కొన్నింటిని మూత వేశారు. నాడు-నేడుతో పెట్టిన రూ.లక్షలు బూడిదలో పోసిన పన్నీరులా మారిపోయాయి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ఉండుంటే ప్రజలు కార్పొరేట్ పాఠశాలల వైపు చూసే అవకాశ మే లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వమైనా ఫీజులు, పుస్తకాల ధరలను నియంత్రించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.





### ఏటా ఫీజులు పెంచేస్తున్నారు



నాకు ఇద్దరు కుమార్తెలు. ఏటా పాఠశాలల ఫీజులు పెంచేస్తున్నారు. ఆర్థికంగా భారమవుతోంది. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం విచారకరం. కొత్తప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి.

- లింగుట్ల యమున, విద్యార్థిని తల్లి, ముదిగుబ్బ

### చదువులు భారమవుతున్నాయి

మాది మధ్యతరగతి కుటుంబం. పిల్లలను చదివించుకోవడం భారంగా మారింది. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకోవాలంటే తలకు మించిన భారమవుతోంది.

- సలీమా, కొత్తచెరువు

### నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాలి

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేయాలి. అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులకు ఆ మేరకు ఆదేశాలు జారీ చేశాం.

- నాగరాజు, విద్యాశాఖ ఏడీ

# రూ. 25 లక్షలు గంగపాలు

రెండేళ్లకే కొట్టుకుపోయిన రహదారి

వైసీపీ నాయకుల నిర్లక్ష్యపు పనులకు పరాకాష్ట

ఇబ్బంది పడుతున్న కణేకల్లు - మాల్యం గ్రామాల ప్రజలు

**కణేకల్లు, జూన్ 10:** వైసీపీ నాయకుల కాసుల కక్కుర్తికి రూ.25 లక్షల రోడ్డు కొట్టుకుపోయింది. కణేకల్లు - మాల్యం గ్రామాల మధ్య వేసిన మట్టి రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. వేదావతి హగరి ఉధృతంగా ప్రవహించే మట్టిరోడ్డు ఏ మాత్రం నిలబడదని తెలిసినా తమ జేబులను నింపుకోవడానికి వైసీపీ నాయకులు చేసిననాసిరకం పనులతో నేడు ప్రజాధనం వృథాగా కొట్టుకుపోయింది. రూ. 25 లక్షల నిధులతో కిలోమీటర్ మేర వేసిన మట్టిరోడ్డులో 70 శాతం వర్షాలకు కొట్టుకుపోగా 25 శాతం మాత్రమే మిగిలింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులకు మరలా కష్టాలు ప్రారంభమయ్యాయి.

### రూ. 25 లక్షలు మంజూరు

కణేకల్లు - మాల్యం గ్రామాల మధ్య వేదావతి హగరిలో అప్పట్లో టీబీ డ్యాం నుంచి విడుదలైన వరద నీరు ఉధృతంగా ప్రవహించేది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. అప్పటి ప్రభుత్వం ఇక్కడ మట్టిరోడ్డు ఏర్పాటుకు రూ.25 లక్షల పంచాయతీరాజ్ నిధులను మంజూరు చేసింది. ఆ రోడ్డు పనులపై స్థానిక వైసీపీ నాయకుల కన్ను పడింది. దీంతో అధికారులను మేనేజ్ చేసుకుని తూతూమంత్రంగా మట్టి వేసి పనులను ముగించారు.

### 15 రోజులకే రహదారికి గండి

నాణ్యత లేకుండా తూతూమంత్రంగా వేయడంతో నీటి ఉధృతికి 15 రోజులకే రోడ్డు తెగిపోయింది. దీంతో ఖంగుతిన్న అధికారులు, వైసీపీ నాయకులు మరలా పైపులు వేసి మరోసారి మట్టివేసి పనులను పూర్తి చేశారు. కానీ వారం కిందట వేదావతి హగరిలో ప్రవహించిన నీటి ఉధృతికి మరోసారి రోడ్డు మొత్తం మూడుచోట్ల తెగిపోయి ఏమాత్రం పనికి రాకుండా పోయింది.

### ప్రయాణికుల అగచాట్లు

కణేకల్లు- మాల్యం గ్రామాల మధ్య ప్రయాణికులకు ప్రత్యామ్నాయ మార్గంగా ఉన్న హెచ్చెల్సీపై అధికారులు బస్సుల రాకపోలను పూర్తిగా నిలిపి వేశారు. మరోవైపు వేదావతి హగరిపై ఉన్న రహదారి కూడా తెగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో కణేకల్లుకు ఉరవకొండతో పాటు హనుమాపురం, సొల్లాపురం, మాల్యం, హనకనహాళ్, గరుడచేడు తదితర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉరవకొండ నుంచి వచ్చే ప్రయాణికులు మాల్యం వరకు ఆర్టీసీ బస్సుల్లోనూ అక్కడ నుంచి ఆటోల్లోనూ కణేకల్లుకు వస్తున్నారు. హెచ్చెల్సీపై గుంతలు మోకాలి లోతులో ఉండగా దానిపై ప్రయాణించేందుకు ప్రయాణికుల నానా అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా వేదావతి హగరిలోని కణేకల్లు- మాల్యం గ్రామాల మధ్య రహదారిని పూర్తి స్థాయిలో నాణ్యంగా, పటిష్ఠంగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కిలోమీటరు రహదారిలో మిగిలిన కొద్దిభాగం రహదారి



కొట్టుకుపోయిన రహదారి.. ప్రవహిస్తున్న వేదవతి

## పోలీసుల అదుపులో సోలార్ కాపర్ వైర్ దొంగలు

చాకచక్యంగా పట్టుకున్న సెక్యూరిటీ గార్డులు

**నంబులపూలకుంట, జూన్ 10:** మండలకేంద్రానికి సమీపంలోని సోలార్ అల్ట్రా పవర్ ప్రాజెక్టులో సోలార్ కాపర్ వైర్ చోరీకి పాల్పడిన దొంగలు పోలీసుల అదుపులో ఉన్నారు. సోమవారం సెక్యూరిటీ గార్డులు, సిబ్బంది ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పి.కొత్తపల్లి, ఎన్పీకుంట రెండు రెవెన్యూ గ్రామల్లో వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో మండలకేంద్రానికి సమీపంలో ఏడువేల ఎకరాల్లో సోలార్ అల్ట్రాపవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. 250 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ప్రాజెక్టును జాక్సన్ కంపెనీకి అప్పగించారు. గత నెల 27వ తేదీన జాక్సన్ కంపెనీలో కాపర్ వైరు చోరీ జరిగింది. 9 కిలోమీటర్ల మేర వైరును రాత్రి సమయంలో చోరీ చేయడంతో ఆసమయంలో ఉన్న సెక్యూరిటీగార్డులు ఇంజనీర్లకు సమాచారం చేరవేశారు. దొంగలు దొరక్కపోవడంతో అదే నెల 28న సురభి ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెక్యూరిటీ ఏజెన్సీ ఎస్ఓ సురేంద్రనాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఎలాగైనా దొంగలను పట్టుకోవాలని సెక్యూరిటీగార్డులు కాపలాకాసి రాత్రివేళల్లో విధులు నిర్వహించారు. ఆదివారం రాత్రి కాపర్‌వైర్‌ను చోరీ చేసుకుని పోతున్నవారిని వెంబడించి పట్టుకున్నట్లు చెప్పారు. పోలీసులకు సమాచారం అందించి, వారిని అప్పగించారు. చోరీ చేసిన కాపర్ వైర్‌ను స్థానిక ఓ గుజరీ వ్యాపారికి చాలా ఏళ్ల నుంచి విక్రయిస్తున్నట్లు సమాచారం. దొంగలను, గుజరీ వ్యాపారిని పోలీసులు అందుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్ఐ శ్రీధర్‌ను వివరణకోరగా, విచారణ చేపట్టి, కేసు నమోదుచేస్తామని తెలిపారు.



చోరీ చేసిన కాపర్ వైర్

## రాజకీయ కక్షతో మామిడి చెట్ల నరికివేత

**మడకశిర రూరల్, జూన్ 10:** మండలంలోని కేతేపల్లికి చెందిన హనుమంతరాయప్ప పొలంలోని మామిడి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నరికివేశారు. రాజకీయ కక్షతోనే ఈ పని చేశారని బాధిత రైతు తెలిపారు. కేతేపల్లికి చెందిన రామాంజనేయులు, హనుమంతరాయప్ప అన్నదమ్ములు. వీరిలో రామాంజనేయులు టీడీపీ బూత్ ఇన్‌చార్జ్, ఆయన తమ్ముడు హనుమంతరాయప్ప వైసీపీ నాయకుడు. హనుమంతరాయప్ప తనకున్న 1.30 ఎకరాల పొలంలో 90 మామిడి చెట్లు పెంచారు. ప్రసుత్తం అవి కాపునకు వచ్చాయి. అందులో పది చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నరికివేశారు. దీంతో రూ.2 లక్షల వరకు నష్టవాటిల్లిందని బాధిత రైతు పేర్కొన్నారు. కాగా పార్టీలు వేరైనా అన్నదమ్ములు ఒక్కటే అని, వారి మధ్య రాజకీయంగా చిచ్చు పెట్టడం కోసం కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రణాళిక ప్రకారం హనుమంతరాయప్ప పొలంలోని మామిడి చెట్లు నరికి వేసినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై హనుమంతరాయప్ప సోమవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తన పొలంలోని మామిడి చెట్లను నరికివేసిన వారిని గుర్తించి, తగు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. దీనిపై మడకశిర సీఐ మనోహర్ మాట్లాడుతూ... కేతేపల్లికి చెందిన హనుమంత రాయప్ప పొలంలో మామిడి చెట్లను గుర్తితెలియని వ్యక్తులు నరికివేసి నట్లు ఫిర్యాదు అందిందన్నారు. గ్రామంలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోంటామని తెలిపారు.



హనుమంత రాయప్ప పొలంలో నరికి వేసిన మామిడి చెట్లు



అనంతపురం.. మేఘావృతం..



చీకటి పడేవేళ.. చినుకులు

## నైరుతి వర్షం



అనంతపురం నగరంలో వర్షం

**అనంతపురం అర్బన్, జూన్ 10:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. అనంతపురం, పామిడి, డి.హీరేహాళ్, నార్పల, పెద్దవడుగూరు, గుంతకల్లు, పుట్లూరు, గుత్తి, యాడికి మండలాల్లో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. బెళుగుప్ప, యల్లనూరు, విడపనకల్లు తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 18 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా శింగనమలో 14.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉరవకొండ 12.2, గార్లదిన్నె 9.2 మి.మీ., మిగిలిన మండలాల్లో 9.0 మి.మీ. లోపు వర్షపాతం నమోదైంది.

## నేడు, రేపు ఎంజేఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా

**పీలేరు, జూన్ 10:** అన్నమయ్య జిల్లా పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా వారి సౌజన్యంతో రెండు రోజుల పాటు జరగనున్న జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయని, సుమారు వేయి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన వారందరూ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని ఆయన వివరించారు. జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, ట్రెండ్జ్ ఇన్ఫర్మేషన్స్, జీఎస్ఎస్ గ్లోబల్, 24/7 ఏఐ, రోబోట్-ఈడీ, సాథర్లాండ్, టీం లీజ్, ఈటీఎస్ గ్లోబ్, క్యూస్ కార్ప్, అపోలో, ఫ్యూషన్ సి ఎక్స్ యంగ్ మైండ్స్, గ్రీన్ బ్లిస్, కాలిబర్ హెచ్ఆర్, ఎయిర్‌టెల్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో 30కిపైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలైన టీసీఎస్, ఆక్సెంచర్, డెల్టా ఎక్స్, ఆలోహ టెక్నాలజీస్, సూర్య టెక్ ప్రాంగణ ఎంపికలు చేసినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగిగా అవకాశం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి వెంకట మాట్లాడుతూ రెండు రోజుల జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.5.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. పీలేరు పరిసర ప్రాంత నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఎంజేఆర్ కళాశాల చైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి

## చంద్రబాబును కలిసిన పరిటాల సునీత, శ్రీరామ్



చంద్రబాబుతో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

**అనంతపురం అర్బన్, జూన్ 10:** టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం విజయవాడలోని కరకట్ట వద్ద చంద్రబాబు నివాసంలో ఆయన్ను కలిసి.. సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబుకు వారు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందడంపై చంద్రబాబు వారిని అభినందించారు.

## ఎమ్మెల్యే సవిత...



చంద్రబాబుకు డిక్లరేషన్ ఫారంను అందజేస్తున్న ఎమ్మెల్యే సవిత, భర్త వెంకటేశ్వరరావు

**పెనుకొండ టౌన్, జూన్ 10:** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే సవిత, భర్త వెంటేశ్వర రావుతో కలిసి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యాలయంలో చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిక్లరేషన్ ఫారంను ఆయనకు అందజేశారు.

## బాలకృష్ణకు సింగవరం రవి జన్మదిన శుభాకాంక్షలు




బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సింగవరం రవి

**అనంతపురం అర్బన్, జూన్ 10:** సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు టీడీపీ సీనియర్ నాయకులు ముళ్లపూడి రవీంద్రనాయుడు (సింగవరం రవి) జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హిందూపురంలోని ఆయన నివాసంలో బాలకృష్ణను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి ఘన విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడంపై శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని

## పరిశీలించిన జాంబియా బృందం

పరిగిలో రైతులతో సమావేశం

**హిందూపురం, జూన్ 10 :** పరిగి మండలంలోని గొరవనహళ్లిలో స్థానిక రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని జాంబియా బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్, రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ ఇన్నోవేటివ్ అధికారి లక్ష్మానాయక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇప్పటి వరకు 1.35లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని సాగుచేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4120గ్రామాల్లో ఈ కార్యక్రమం అమలు అవుతోందన్నారు. రైతు సాధికార సంస్థ ప్ర పంచ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, దాతృత్వ సంస్థల భాగస్వామ్యంతో కలిసి పనిచేస్తోందన్నారు. ప్రపంచంలో విస్తృత స్థాయిలో ఆగ్రో ఎకాలజీ కార్యక్రమం నడుపుతున్న సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జాంబి యా దేశ ప్రతినిధి బృందం ఈ నెల 7నుంచి 21వరకు పర్యటిస్తోందని, ఇందులో ఉమ్మడి అనంత పురం జిల్లాలో ఈ బృందం పర్యటించిందన్నారు. ఇక్కడ సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయంపై సంతృప్తి చెందారని, తమ దేశంలోనూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కృషిచేస్తామని వారు చెప్పారని లక్ష్మానాయక్ తెలిపారు.



ఆహార దినుసులను పరిశీలిస్తున్న జాంబియా దేశ బృందం



## చీనీకాయలు టన్ను రూ.38 వేలు

**అనంతపురంరూరల్, జూన్ 10:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.38 వేలు, కనిష్ఠంగా రూ.15 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1204 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

## ఇంట్లోకి చొరబడ్డ దొంగలు

మహిళపై దాడి.. 12 తులాల బంగారం దోపిడీ

**తాడిపత్రి టౌన్, జూన్ 10:** పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. ఓ ఇంట్లోకి చొరబడి మహిళను బెదిరించారు. బ్లేడ్‌తో దాడి చేసి 12 తులాల బంగారు ఆభరణాలను దోచుకున్నారు. తాడిపత్రి పట్టణంలోని రెడ్డినగర్‌లో దూదేకుల దస్తగిరి, ఆయన భార్య సరోజమ్మ నివాసం ఉంటుంది. బ్యాంకు పనిమీద దస్తగిరి బయటకు వెళ్లారు. ఆ సమయంలో వారి ఇంట్లోకి ఇద్దరు దుండగులు మాస్కులు, బురఖాలు ధరించి ప్రవేశించారు. సరోజమ్మ మెడలోని ఆరుతులాల బంగారు నగలు, చేతులకున్న బంగారు గాజులను ఇవ్వాలని భయభ్రాంతులకు గురిచేశారు. ఆమె మాట వినకపోవడంతో బ్లేడుతో విచక్షణారహితంగా దాడిచేశారు. బంగారు నగలను లాక్కొని ఉడాయించారు. విషయం తెలుసుకున్న దస్తగిరి వెంటనే ఇంటికి చేరుకుని, పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ జనార్దన్‌నాయుడు, సీఐ నాగేంద్రప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



గాయపడ్డ సరోజమ్మ

గాయపడిన దుప్పి..

## అటవీశాఖకు అప్పగింత

**తనకల్లు, జూన్ 10:** మండలంలోని పెద్దపల్లి గ్రామం వద్ద సోమవారం ఓ దుప్పి తీవ్రగాయాలతో గ్రామస్థుల కంటపడింది. గ్రామస్థులు దుప్పిని కాపాడి అటవీశాఖకు అప్పగించే ప్రయత్నం చేశారు. అటవీశాఖాధికారులు దుప్పివద్దకు చేరుకునేలోపు, దుప్పి మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన మేరకు దుప్పిని ఎవరైనా వెంటాడారో, లేక అడవిలో గాయపడిందో తెలియదన్నారు. అటవీశాఖాధికారి పెద్దపల్లి గ్రామం వద్దకు వెళ్లి పరిశీలించగా దుప్పి మృతిచెందింది. విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులు దుప్పిని అక్కడనుంచి కొక్కంటి క్రాస్‌లో ఉన్న సెంట్రల్ నర్సరీకి తీసుకొచ్చారు. పశువైద్యాధికారి విజయ్‌ని పిలిపించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం దుప్పిని ఖననం చేశారు. అటవీశాఖాధికారి శ్రీరాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

**అనంతపురం సెంట్రల్, జూన్ 10:** జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని సోమవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మేలో ఎంసీఏ నాల్గో సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్, సప్లమెంటరీతో పాటు (ఆర్17,20) సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. వీటితోపాటు మూడో సెమిస్టర్(ఆర్17,20,21) సప్లమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. అదేవిధంగా ఎంబీఏ తృతీయ సెమిస్టర్ (ఆర్17,21) సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## ఎప్పుడు కూలుతుందో...?

శిథిలావస్థలో పురం ఆసుపత్రి

**హిందూపురం అర్బన్, జూన్ 10:** రోగులకు సేవలు అందించడంలో ఉమ్మడి జిల్లాలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి రెండోస్థానంలో ఉంది. ప్రతి రోజూ వందలాది మంది రోగులు వివిధ చికిత్సల కోసం ఇక్కడికి వస్తుంటారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే విభాగం కీలకమైంది. దీని సమీపంలో ఉన్న ఆసుపత్రి భవనం పైభాగం శిథిలమైపోయింది. కూలడానికి సిద్ధంగా ఉంది. వర్షం వస్తే నీరు ఎక్స్‌రే విభాగానికి వచ్చే దారిలో బయటి వైపు నిల్వ ఉంటుంది. భవనం లీకేజీ నీరు పాత సీటీ స్కానింగ్ ప్రాంతంలో చేరుతుంది. దీంతో ఎక్స్‌రే కోసం వచ్చే రోగులు జారి పడే ప్రమాదం ఉంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అటుగా వెళ్లి పని చేయాలంటే పారిశుధ్య సిబ్బంది భయపడుతున్నారు. టీడీపీ హయాంలో ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. వైసీపీ అధికారంలోకి వచ్చాక హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క అభివృద్ధి పని కూడా జరుగలేదు. ఏదైనా ప్రమాదం జరుగక ముందే సంబంధిత అధికారులు మేల్కొని, తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.



రంధ్రం ఏర్పడి లీకేజీ అవుతున్న వైనం

## సీఎం ప్రమాణస్వీకారాన్ని తిలకించేందుకు ప్రత్యేక స్ర్కీన్లు



బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

**ధర్మవరం, జూన్ 10:** ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ప్రత్యేక స్ర్కీన్లను ఏర్పాటుచేయనున్నారు. ప్రమాణస్వీకారాన్ని ప్రజలు తిలకించేందుకు భారీ స్ర్కీన్లను టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్నారు. సోమవారం జూనియర్ ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.నరేంద్రచౌదరి ఆధ్వర్యంలో టీడీపీశ్రేణులు క్రీడామైదానాన్ని పరిశీలించారు. ప్రమాణ స్వీకారాన్ని తిలకించేందుకు భారీ ఎత్తున ప్రజలు వస్తారని, ఈ క్రీడామైదానం అయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని నరేంద్రచౌదరి తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పాల్గొన్నారు.

## వర్షాలు కురిశాయి సరే.. విత్తనకాయలు ఎక్కడ?

**కొత్తచెరువు,జూన్ 10:** వర్షాలు సకాలంలో కురవడంతో రైతన్నలు వ్యవసాయ పొలాలను దుక్కులు చేసుకుని వేరుశనగ విత్తనకాయల కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం రైతులకు విత్తనకొరత లేకుండా చూస్తామని ప్రకటించింది. అయితే ఆర్బీకే కేంద్రాల ద్వారా విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు ఇప్పటివరకు 71,339 క్వింటాళ్లను 82,9209 మందికి అందజేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇంకా విత్తనకాయల కోసం రైతులు ఆర్బీకే కేంద్రాలలో వేలసంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నట్లు తెలుస్తోంది. ధర్మవరం, కదిరి, ఏపీసీడ్స్ విత్తనశుద్ధి కేంద్రాల ద్వారా విత్తనకాయలు గోదాములకు సరఫరా కాకపోవడంతో రైతులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు 99,274 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారికి 84,536.40 క్వింటాళ్ల విత్తనకాయలు అవసరమని వ్యవసాయధికారులు పేర్కొంటున్నారు. విత్తనకాయలు సరఫరా కాకపోవడంతో ఆర్బీకేల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విత్తన వేరుశనగ కాయలు సరఫరా చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## టీడీపీ కార్యకర్తపై హోంగార్డు దాడి



గాయపడిన పత్తిపాటి నాగేంద్ర

**కొత్తచెరువు, జూన్ 10:** మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త పత్తిపాటి నాగేంద్రపై పుట్టపర్తిలో హోంగార్డుగా పనిచేసే ఆది ఇనుప చైర్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన మేరకు.... స్థానిక కాలేజ్ గ్రౌండ్‌లో విద్యార్థులు క్రికెట్ ఆడుతున్నారు. నాగేంద్ర పనినిమిత్తం గ్రౌండ్‌లో వెళ్తుండగా క్రికెట్ బాల్ ఆయనకు తగిలింది. దీంతో ఆయన విద్యార్థులను చూసుకుని క్రికెట్ ఆడాలని మందలించారు. ఆ విద్యార్థులలో ఒకరు తన తండ్రి హోంగార్డు ఆదికి జరిగిన విషయాన్ని తెలిపాడు. వెంటనే హోంగార్డు ఆది నాగేంద్ర వద్దకు వెళ్లి మా పిల్లవాన్నే మందలిస్తావా అంటూ నేనెవరో నీకు తెలియదా అని ఊగిపోతూ అక్కడే ఉన్న ఇనుప చైర్‌తో దాడి చేశాడు. ఆయనకు ఎడమ చెయ్యి విరిగింది. భుజంపై కూడా గాయాలయ్యాయని ఆయన తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే సీఐ లేకపోవడంతో బాధితుడు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి వెళ్లారు.

## చేపల చెరువు వద్ద ఘర్షణ

● పరస్పరం పోలీసులకు ఫిర్యాదు

**కదిరిఅర్బన్, జూన్ 10:** మండలంలోని దేవరచెరువు వద్ద చేపలు పట్టుకునే విషయంపై ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. రూరల్ సీఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు కదిరి పట్టణానికి చెందిన ఇందయతుల్లా, కౌలేపల్లికి చెందిన నారాయణ స్వామి ఆదివారం చేపలు పట్టుకునే విషయంపై వాగ్వాదం చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం ఇరుపక్షాలు ఫిర్యాదులు చేశారన్నారు. ఇందయతుల్లాను కౌలేపల్లికి చెందిన నారాయణస్వామి, చంద్ర, మధు, చిరంజీవి, సాంబశివ చేపలు పట్టుకునే విషయంలో వాగ్వివాదం జరిగిందని, చేపలు పట్టవద్దను తనను బెరించినట్లు ఫిర్యాదు చేశారు. ఇందాయతుల్లా, నదీం, వజ్రభాస్కర్‌రెడ్డి, అత్తార్‌చాంద్‌బాషా కలిసి నారాయణస్వామిని కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## విధులకు సీడీపీఓ డుమ్మా



ఖాళీగా దర్శనమిస్తున్న సీడీపీఓ కుర్చీ

**బత్తలపల్లి, జూన్ 10:** ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులు సమయపాలన పాటించడంలేదు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సిన అధికారులు రావడం లేదు. సోమవారం కార్యాలయానికి 10.30 గంటలకు సూపర్‌వైజర్లు రావాలని గ్రూప్‌లో మేసేజ్ పెట్టారు. సూపర్‌వైజర్లు కార్యాలయానికి వచ్చారు. అయితే సీడీపీఓ సరస్వతి మాత్రం సాయంత్రం 4 గంటలైనా కార్యాలయానికి రాలేదు. సూపర్ వైజర్లు సాయంత్రం వరకు ఎదురుచూసి ఆమె రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. ప్రభుత్వాలు మారినా అధికారులు మాత్రం సమయపాలన పాటించడం లేదు. దీనిపై ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారిని వివరణ కోరగా బత్తలపల్లి సీడీపీఓ సరస్వతి సెలవు పెట్టలేదని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

## వేళకు రాని ఆర్టీసీ బస్సు సర్వీసులు

● ప్రయాణికులకు తప్పని పాట్లు




బస్సులోకి తోసుకుంటూ ఎక్కుతున్న ప్రయాణికులు

**గాండ్లపెంట, జూన్ 10:** కదిరి వయా రాయచోటికి వెళ్లే బస్సులు సమయ పాలన పటించలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రధాన రహదారి కదిరి, రాయచోటి మార్గ మధ్యలో ఎక్కువగా పల్లెలున్నాయని, నిత్యం వివిధ పనుల నిమిత్తం వందల సంఖ్యలో ప్రజలు ప్రయాణిస్తుంటారన్నారు. గాండ్లపెంట నుంచి రాయచోటి, కదిరికి బస్సుల్లో వెళ్లాలంటే గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు సర్వీసులు సమయ పాలన పాటించకపోవడంతో ఒకేసారి మూడు బస్సులు వస్తాయని అంటున్నారు. దీంతో ఒకరినొకరు తోసుకుని, చివరకు ఫుట్‌బోర్డుపై ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. మహిళలు, వృద్ధులు బస్సులు ఎక్కాలంటే భయంగా ఉంటుందన్నారు. కదిరి, రాయచోటి బస్సు సర్వీసులు నిర్దేశించిన సమయాల్లో రాకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# కొండెక్కిన కూరగాయల ధరలు

● రూ.500 తీసుకెళ్లినా.. సంచినిండా రావడం లేదు
● మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి

| కూరగాయలు ధరలు (కిలోలల్లో)ఇలా... | |
|---|---|
| టమోటా | రూ.70 |
| బీన్సు | రూ.120 |
| పచ్చిమిరప | రూ.140 |
| కాకర | రూ.80 |
| మునగ | రూ.100 |
| క్యారెట్ | రూ.60 |
| దుంపలు | రూ.60 |
| బీట్‌రూట్ | రూ.60 |
| చిక్కుడు | రూ.80 |
| ఉల్లిగడ్డలు | రూ.50 |
| వెల్లుల్లి | రూ.200 |

**పుట్టపర్తి, జూన్ 10:** ఆహారం రుచిగా ఉండాలంటే అందులో మంచికూరలు ఉండాల్సిందే. మనిషికి ప్రతినిత్యం కూరగాయలు తప్పనిసరి. కోటీశ్వరులైనా కూలోడైనా ఇంత ముద్ద దిగాలంటే కూరలు అవసరం. ఇటీవల కాలంలో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ధరలు పెరిగిపోవడంతో సామాన్యులకు భారంగా మారింది. వీటిని కొనలేం తినలేం అన్న పరిస్థితి నెలకొంది. పంటల దిగుబడి తక్కువగా ఉండటం, సుదూరప్రాంతాలనుంచి రవాణాగా తీసుకరావడం అందుకు ఖర్చులతో మరీ ధరలు పెరిగిపోయాయి. వారానికి సరిపడ కూరగాయలు కోసం వందలకు వందలు ఖర్చుపెట్టాల్సి వస్తోంది.



మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

### ఐదు వందలైనా కూరగాయలు రావడంలే



వారం వారం కూరగాయలకు ఐద వందలు తీసుకెళ్లినా సంచిలోకి సరిపడా రావడంలేదు. నెల రోజులకుపైగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. సంపాదనలో ఎక్కువ భాగం కూరగాయలకే పెట్టాల్సి వస్తోంది. ఎప్పుడు ధరలు తగ్గుతాయో?

- చిట్టెమ్మ గోకులం పుట్టపర్తి

### కొనలేం... తినలేం..



దిగువ మధ్యతరగతికి చెందిన మాలాంటి వారికి కూరగాయలు కొనడం భారంగా మారింది. రూ. 200 తీసుకెళ్తే సంచినిండా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు ప్రతీది 50 నుంచి 100 రూపాయలకుపైగా పెరగడంతో కొని తినలేకపోతున్నాం.

- చిన్నాగమ్మ కొత్తచెరువు

### రైతు బజార్ల ద్వారా కూరగాయలు ఇవ్వాలి

కూరగాయలు అందుబాటులో తీసుకరావడానికి రైతుబజార్లను ఏర్పాటు చేయాలి. జిల్లాకేంద్రంతో పాటు మున్సిపాలిటీల్లో రైతుబజార్లు ఏర్పాటుచేసి కూరగాయలను సరసమైన ధరలకు అందించాలి. టీడీపీ ప్రభుత్వంలో రైతుబజార్లలో కూరగాయలు చౌకగా దొరికేవి. కొత్తప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

- షంషాద్ ముదిగుబ్బ

## డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా షర్ఫుద్దీన్



**ఓబుళదేవరచెరువు, జూన్ 10:** డెమొక్రెటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా షెక్ షర్ఫుద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టుబడి గౌస్‌లాజం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో కార్యదర్శిగా ఓడీసీ మండలానికి చెందిన షేక్ షర్ఫుద్దీన్ ఎన్నికైనట్లు తెలిపారు. ఆయన ఎంపిక పట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంసీ నరసింహులు, సోముశేఖర్‌నాయక్, వెంకటాచలమయ్య, నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

## హైరిస్క్ కేసులను నివారిద్దాం



గర్భిణులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

**ఓబుళదేవరచెరువు, జూన్ 10:** హైరిస్క్ ఉన్న గర్భిణులకు పరిస్థితులను వివరించి సమస్యలను నివారించకలిగితే సాధారణ ప్రసవాలు సాధ్యమని వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక వైద్యశాలలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వం అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. విటమిన్లు, ప్రొటీన్లు, ఖనిజాలతో గర్భవతుల పోషకాహార ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. 70 మంది గర్భిణుల్లో 34 మందికి హైరిస్క్ ఉన్నట్లు గుర్తించి, అత్యవసర చికిత్స అందించి, 21 మందికి ఉచిత స్కానింగ్, మందులు అందించినట్లు తెలిపారు. గర్భిణులకు కదిరిరోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పృథ్వీ, నితిన్ భోజన సౌకర్యం కల్పించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా పనిచేయాలి: ఎస్పీ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎస్‌ఐ నజీర్‌అహ్మద్

**పుట్టపర్తిరూరల్, జూన్ 10:** సమర్థవంతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. చెన్నేకొత్తపల్లి, కియ పోలీసుస్టేషన్లలో ఏఎస్‌ఐలుగా పనిచేస్తూ ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన సూర్యనారాయణ, నజీర్‌అహ్మద్‌లు సోమవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందచేశారు.

## పోలీసు స్పందనకు మిశ్రమ స్పందన

**పుట్టపర్తి రూరల్, జూన్ 10:** సార్వత్రిక ఎన్నికల తర్వాత మొట్టమొదటి సారి జిల్లా ఎస్పీకార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మిశ్రమ స్పందన లభించింది. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి 6 ఫిర్యాదులు స్వీకరించారు. పోలీసు చట్టపరిధిలో ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎస్పీ తెలిపారు. స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, క్రైంబ్రాంచ్ సీఐ శ్రీహర్ష, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాణస్వీకారానికి తరలిన తెలుగు తమ్ముళ్లు

**నల్లమాడ, జూన్ 10:** చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా 12వ తేదీన అమరావతిలో ప్రమాణ స్వీకరం చేయనున్నారు. ప్రమాణ స్వీకారానికి టీడీపీ నల్లమాడ మండల నాయకులు, కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు. పలువురు నాయకులు రైళ్లలో రిజర్వేషన్లు చేసుకుని వెళ్లారు. వెళ్లినవారిలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, రమేష్, కేశవరెడ్డి, సలాంఖాన్, అశోక్‌ఖాన్, వెంకటరమణనాయుడు, గంగులప్పనాయుడు, నరసింహులు ఉన్నారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు

**ముదిగుబ్బ, జూన్ 10:** మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానంటూ నమ్మించి లైంగికంగా వేధించిన చంద్ర అనే యువకుడిపై బాలిక తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ యతీంద్ర తెలిపారు.

# టీ.. బిస్కెట్ల కోసమేనా సమావేశాలు?

● అధికారులను నిలదీసిన టీడీపీ ఎంపీటీసీ, సర్పంచ్



అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసులు

**ఓబుళదేవరచెరువు, జూన్ 10:** టీ, బిస్కెట్లకోసమేనా సమావేశాలు నిర్వహించేది. గతంలో చెప్పిన సమస్యలు పరిష్కారం అవుతాయా లేదా సమాధానం చెప్పాలని వెంకటాపురం ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్‌రెడ్డి అధికారులను నిలదీశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తుమ్మల పర్వీన్‌షామీర్ అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు. విద్యాశాఖపై ఎంఈఓ సురేష్‌బాబు మాట్లాడుతుండగా, సర్పంచ్, ఎంపీటీసీలు జోక్యం చేసుకుని, దశాబ్దాలుగా వెంకటాపురం పంచాయతీలోని వీర ఓబున్నపల్లి పాఠశాల శిథిలావస్థకు చేరిందని, మరమ్మతు చేపట్టాలని పలుమార్లు మీదృష్టికి తీసుకొచ్చినా ఏమిచేశారని నిలదీశారు. ఆర్బీకే కేంద్రాల్లో ఎరువులుకూడా రైతులకు ఇచ్చేలా చూడాలని చింతమానుపల్లి సర్పంచ్ జగన్మోహన్‌చౌదరి, ఏఓ ఇలియాజ్‌అహమ్మద్ దృష్టికి తీసుకెళ్లారు. హార్టికల్చర్ అధికారి లావణ్యారెడ్డి, ఈఓఆర్‌డీ రాజశేఖర్, పశువైద్యాధికారి ప్రవీన్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి, వైద్యాధికారి భానుప్రకాష్‌నాయక్ వారి వారి శాఖలపై మాట్లాడారు. ఎంపీడీఓ వరలక్ష్మి, ఏపీఓ సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, వివిధ శాఖల అధికారుల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఆర్టీసీ, రెవెన్యూ, పీఆర్, గృహణ నిర్మాణ, పట్టుపరిశ్రమ శాఖాధికారులు హాజరు కాకపోవడం గమనార్హం.

## కందికుంటకు అభినందనలు



ఎమ్మెల్యేని అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

**కదిరిఅర్బన్, జూన్ 10:** ఎమ్మెల్యేగా గెలుపొందిన కందికుంట వెంకటప్రసాద్‌ను ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం పూలమాలతో సత్కరించి, అభినందించారు. విద్యారంగంలో నెలకున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 117జీవోను రద్దు చేయాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయపోస్టులు భర్తీ, సరెండర్ లీవులు, ఏపీజీఎల్‌ఐసీ క్లెయిమ్‌లు తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా మీరు పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మల్లికార్జున, సునిల్‌కుమార్, ఆజాంబాషా, షైనోద్దీన్, మధుసూదన్, మహబూబ్‌బాషా, షైనోద్దీన్, మనోహర్, నాగరాజు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## వైభవంగా ఎలవ గంప ఉత్సవం



అక్కదేవతలకు ఎలవగంప మోసుకెళుతున్న భక్తులు

**నల్లమాడ, జూన్ 10:** మండలంలోని పెద్దకోట్లపల్లి, సోముగుట్టపల్లి సమీపంలో ఉన్న రాజుల తోపులో అక్కదేవతలకోసం ఎలవ గంప ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సోముగుట్టపల్లి సమీపంలోని చింతతోపులో అక్కదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గొడుగులు, అభరణాలతో ఎలవగంపను సోముగుట్టపల్లి నుంచి ఊరేంపుగా రాజుల పరుష వరకు ఉరుములు, వాయిద్యాలతో తీసుకెళ్లారు. అక్కడ రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కదేవతలకు ప్రత్యేకంగా అలంకరించినట్లు పూజారులు, గ్రామస్థులు తెలిపారు. పెద్దకోట్లపల్లి, సోముగుట్టపల్లి, కొండ్రవారిపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీతో కంది విత్తనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

**ముదిగుబ్బ, జూన్ 10:** రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో కంది విత్తనాలను పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది రైతులు పంటలు సాగుచేసి నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాదైనా రైతులకు సబ్సిడీతో విత్తనాలు అందించి ఆదుకోవాలని కోరారు. నాయకులు కిష్టయ్య, చిన్నప్ప పాల్గొన్నారు.

## 29న జాతీయ మెగా లోక్ అదాలత్

**ధర్మవరం, జూన్ 10:** స్థానిక కోర్టులో 29వ తేదీన జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి గీతావాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులు, బ్యాంకు రుణం పెండింగ్‌లో ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని న్యాయాధికారి సూచించారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**పుట్టపర్తిరూరల్, జూన్ 10:** మండలంలోని జగరాజుపల్లి ఆదర్శపాఠశాలలో మిగిలిన పోయిన 7, 8, 9 తరగతుల సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 14వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు జగరాజుపల్లిలో విద్యార్థులకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈఅవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఐఐటీకి ఎంపికైన కదిరేపల్లి విద్యార్థిని

**అగళి, జూన్ 10 :** మండలంలోని కదిరేపల్లికి చెందిన విద్యార్థిని భూమిక చెన్నై ఐఐటీకి ఎంపికైనట్లు విద్యార్థిని తండ్రి మంజు నాథ్ తెలిపారు. భూమిక మండలంలోని మ ధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. అనంతరం ఆర్టీటీ సహకారంతో విజయవాడలోని శ్రీచైతన్య క శాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. ఇటీవల జరిగిన జేఈఈ పరీక్షల్లో 109మార్కులు సా ధించి క్యాటగిరి ర్యాంకు 6772తో ఐఐటీకి ఎంపి కైనట్లు తెలిపారు. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు దాసేగౌడ, ఉపాధ్యా యులు, విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

# ఘనంగా బాలయ్య జన్మదినం

**పుట్టపర్తి, జూన్ 10:** సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ సర్కిల్‌లో కేక్‌నుకట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు మోహన్‌నాయుడు,. నాగభూషణ, శంకర్, బేకరినాయుడు, కిష్టప్ప, రవి, ఆంజనేయులు, రాఘవ, రాజప్ప పాల్గొన్నారు.

**ధర్మవరం:** ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. 36వ వార్డులో కేక్‌ను కట్ చేసి పంచుకున్నారు. గోనుగుంట్ల విజయ్‌కుమార్, పరిశేసుధాకర్, ఫణికుమార్, మద్దిలేటి, మేకల రామాంజనేయులు, భాస్కర్‌చౌదరి, చందారాఘవ, చిన్నూరువిజయ్, జింకా పురుషోత్తం, మాధవరెడ్డి, అమరా సుధాకర్ రాయపాటిశివ పాల్గొన్నారు.

**బాలయ్య ఫ్యాన్స్ ఆధ్వర్యంలో:** బాలయ్య జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణంలోని శివానగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాలయ్య ఫ్యాన్స్ అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో చిన్నారి చేత కేక్‌కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు.

**కొత్తచెరువులో:** బాలకృష్ణ జన్మదిన వేడుకలను అభిమానులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నాలుగురోడ్ల కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేశారు. ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం చేశారు. కొండప్పగారి శ్రీహరి, అవినాశ్, కళాధర్, కల్యాణ చక్రవర్తి, నవీన్‌కుమార్, శ్రీహర్ష, చైతన్య, విజయ్, విష్ణు, రాజేశ్ పాల్గొన్నారు.

**నల్లమాడ:** బాలకృష్ణ జన్మదినాన్ని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక స్వాతి క్లీనిక్‌లో నాగభూషణనాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. మండలకన్వీనర్ శివశంకర్, గస్‌రెడ్డి, కులశేఖర్‌నాయుడు, మంజునాథ్‌రెడ్డి, పల్లపు ప్రతాప్, శివప్రసాద్‌రెడ్డి, హనుమంతురెడ్డి, మహబూబ్‌బాషా, సోముశేఖర్‌రెడ్డి, జనసేన అబ్దుల్ అబూ పాల్గొన్నారు.



ధర్మవరంలో చిన్నారితో కేక్ కట్‌చేయిస్తున్న బాలయ్య అభిమానులు



పుట్టపర్తిలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

**పుట్టపర్తి:** ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హనుమాన్ సర్కిల్‌లో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు మోహన్‌నాయుడు, నాగభూషణ, శంకర్, బేకరినాయుడు, కిష్టప్ప, రవి, ఆంజనేయులు, రాఘవ, రాజప్ప పాల్గొన్నారు.

**ధర్మవరంరూరల్:** ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం పట్టణంలోని పీఆర్‌టీ వీధిలో మాజీ సిల్క్ వీవర్స్ సొసైటీ అధ్యక్షులు పామిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ కౌన్సిలర్ కలమిశెట్టి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పరిసేసుధాకర్, వెంకటేష్ బాబు, బద్దెలరాము, లక్ష్మీకాంత్, పామిశెట్టి చంద్రశేఖర్, చక్రపాణి, మాజీ కౌన్సిలర్ అన్నం శ్రీనివాసులు, లోకేష్ పాల్గొన్నారు.



ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



కొత్తచెరువులో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు




కొత్తచెరువులో...

## ఐఐటీకి ఎంపికైన కదిరేపల్లి విద్యార్థిని


ఐఐటీకి ఎంపికైన భూమిక

**అగళి, జూన్ 10:** మండలంలోని కదిరేపల్లికి చెందిన విద్యార్థిని భూమిక చెన్నై ఐఐటీకి ఎంపికైనట్లు విద్యార్థిని తండ్రి మంజునాథ్ తెలిపారు. భూమిక మండలంలోని మధూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. అనంతరం ఆర్డీటీ సహకారంతో విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. ఇటీవల జరిగిన జేఈఈ పరీక్షల్లో 109మార్కులు సాధించి క్యాటగిరి ర్యాంకు 6772తో ఐఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు దాసేగౌడ, ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

## అంబికాకు సన్మానం

**హిందూపురం, జూన్ 10 :** అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను టీడీపీ స్థానిక నాయకులు సత్కరించారు. ఎంపీ అయిన తరువాత ఆయన మొదటిసారిగా బాలకృష్ణ జన్మదిన వేడుకలకు సోమవారం హిందూపురం వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు , పలువురు అధికారులు అంబికా నివాసానికి వెళ్లి ఆయనను సత్కరించారు.

## టీడీపీ నుంచి నాయకుడి బహిష్కరణ

**హిందూపురం, జూన్ 10 :** లేపాక్షి మండలం పులమతి పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు తిమ్మారెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిమ్మారెడ్డి ఇటీవల పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

### గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి

## ఇంటర్ విద్యార్థి మృతి


విద్యార్థి సంతోష్ (ఫైల్)

**పెనుకొండ రూరల్, జూన్ 10 :** సరదాగా ఈతకు వెళ్లి గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి ఉప్పర సంతోష్(18) అనే ఇంటర్ విద్యార్థి మృతిచెందినట్లు కియ ఇండస్ట్రియల్ ఎస్ఐ రంగడు తెలిపారు. పెనుకొండ పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు ఉప్పర మల్లికార్జున, ఈరమ్మ దంపతుల కుమారుడు ఉప్పర సంతోష్ పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివి 838మార్కులు సాధించాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం సంతోష్ తన తోటి స్నేహితులతో కలిసి రిజర్వాయర్ సందర్శనకు వెళ్లాడు. రిజర్వాయర్‌లోని మడకశిర బ్రాంచ్ కెనాల్ గేట్‌వద్ద కాలువలో నీరు తక్కువగా ఉండటంతో సంతోష్, స్నేహితులు ఈతకెళ్లారు. గేట్‌వద్ద లోతుగా ఉండటంతో సంతోష్‌కు ఈతరాక మునిగిపోయాడు. తోటి స్నేహితులు కూడా ఈతరాక కాపాడలేకపోయారు. వారు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న రైతులు పరుగన వచ్చి సంతోష్‌ను నీటిలోంచి వెలికితీశారు. అయితే అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. సంతోష్ కుటుంబ సభ్యులు, స్నేహితులు బోరున విలపించడం అందరిని కలిచివేసింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సవిత విజయవాడ నుంచి సంతోష్ కుటుంబ సభ్యులను ఫోన్‌చేసి పరామర్శించారు. అలాగే టీడీపీ నాయకులు మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం, బాబిరెడ్డి, సాయిరమేష్, గోపాల్ తదితరులు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


సంతోష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

## ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

**పెనుకొండ రూరల్, జూన్ 10 :** పట్టణ సమీపంలోని మడకశిర వెళ్లే రహదారిలో ద్విచక్రవాహనం బోల్తాపడి మంజు అనే వ్యక్తి గాయపడ్డాడు. పట్టణానికి చెందిన మంజు సోమవారం ద్విచక్రవాహనంలో తన స్నేహితుడిని మడకశిరలో వదిలి తిరిగి పెనుకొండకు వస్తున్నారు. పెనుకొండ సమీపంలోకి రాగానే కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో మంజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ప్రాణాలు తీసిన సరదా

### చెక్‌డ్యాంలో పడి తండ్రీకొడుకుల మృతి


మృతి చెందిన రాజగోపాల్


మృతి చెందిన వశిష్ట

**ఆత్మకూరు, జూన్ 10:** మండల పరిధిలోని వడ్డుపల్లి గ్రామ సమీపంలోని చెక్‌డ్యాంలో పడి తండ్రి, కొడుకు మృత్యువాత పడ్డారు. అనంతపురం నగరంలోని 4వ రోడ్డుకు చెందిన రాజగోపాల్ తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం ఉదయం పంపనూరు ఆలయానికి వెళ్లారు. దర్శనానంతరం అనంతపురానికి బయలుదేరారు. మార్గం మధ్యలో, వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద చెక్‌డ్యాంలో నీటిని చూసేందుకు తండ్రి, కొడుకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ కుమారుడు వశిష్ట(7) నీటిలో పడిపోయాడు. కాపాడుకునేందుకు తండ్రి రాజగోపాల్(37) నీటిలో దుకాడు. ఈత రాకపోవడంతో ఇద్దరూ నీట మునిగారు. ఒడ్డున ఉన్న రాజగోపాల్ భార్య అరుణ కేకలు వేసి రోడ్డుపై వెళుతున్న వాహనదారులను పిలిచారు. వారు వెంటనే వచ్చి ఇద్దరినీ చెక్‌డ్యాం నుంచి బయటకు తీశారు. కొన ఊపిరితో ఉండగా 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## టీడీపీ కార్యకర్తపై హోం గార్డు దాడి


గాయపడిన పత్తిపాటి నాగేంద్ర

**కొత్తచెరువు, జూన్ 10:** మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త పత్తిపాటి నాగేంద్రపై పుట్టపర్తిలో హోంగార్డుగా పనిచేసే ఆది ఇనుప చైర్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన మేరకు.... స్థానిక కాలేజ్ గ్రౌండ్‌లో విద్యార్థులు క్రికెట్ ఆడుతున్నారు. నాగేంద్ర పనినిమిత్తం గ్రౌండ్‌లో వెళ్తుండగా క్రికెట్ బాల్ ఆయనకు తగిలింది. దీంతో ఆయన విద్యార్థులను చూసుకుని క్రికెట్ ఆడాలని మందలించారు. ఆ విద్యార్థులలో ఒకరు తన తండ్రి హోంగార్డు ఆదికి జరిగిన విషయాన్ని తెలిపాడు. వెంటనే హోంగార్డు ఆది నాగేంద్ర వద్దకు వెళ్లి మా పిల్లవాన్నే మందలిస్తావా అంటూ నేనెవరో నీకు తెలియదా అని ఊగిపోతూ అక్కడే ఉన్న ఇనుప చైర్‌తో దాడి చేశాడు. ఆయనకు ఎడమ చెయ్యి విరిగింది. భుజంపై కూడా గాయాలయ్యాయని ఆయన తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తే సీఐ లేకపోవడంతో బాధితుడు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి వెళ్లారు.

# ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


బాలయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


కేక్ కట్ చేస్తున్న మాజీ కౌన్సిలర్ నంజప్ప, ప్రభాకర్

### పోటెత్తిన అభిమానులు

**హిందూపురం, జూన్ 10 :** ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదినం పురస్కరించుకుని సోమవారం హిందూపురంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు భారీఎత్తున అభిమానులు, నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ కంజక్షన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రావిళ్లలక్ష్మి, నాయకులు అనిల్‌కుమార్, వెంకటస్వామి ఉన్నారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజు, మంగేష్, ప్రెస్‌వెంకటేశ్, మగ్బూల్, రాఘవేంద్ర, చంద్రమోహన్, వాణిజ్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచల్ రెడ్డి, టీఈపీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, మండల కన్వీనర్లు అశ్వత్థనారాయణరెడ్డి, రమేష్, జయప్ప, రంగారెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి, సర్పంచ్ మంజునాథ్ బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ బీసీసెల్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, ఆంజనేయులు, రవిచంద్ర, అమీన్, బాబురెడ్డి, భార్గవ్, ప్రవీణ్, నాగేంద్ర, చిక్కీరప్ప, రామకృష్ణా రెడ్డి, హనుమంతు, అంజినరెడ్డి, నవీన్, కౌన్సిలర్లు, పలువురు అధికారులు, అనధికారులు, ఎన్‌బీకే ఫ్యాన్స్ నాయకులు నంబూరి సతీష్, బండారు బాలాజీ, హెచ్ఎన్ రాము, మాజీ కౌన్సిలర్ నంజప్ప, ప్రభాకర్, ఈడిగ నారాయణ స్వామి, నాగభూషణం, రాజశేఖర్, గోపాల్, ఆది, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.


గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న నాగరాజు

## లోకేశ్, భువనేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే సవిత


నారా లోకేశ్‌కు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న ఎమ్మెల్యే సవిత, భర్త వెంకటేశ్వరరావు


నారా భువనేశ్వరిని కలిసిన సవిత దంపతులు

**పెనుకొండ టౌన్, జూన్ 10 :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని ఎమ్మెల్యే సవిత సోమవారం ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యాలయంలో భర్త వెంకటేశ్వర్‌రావుతో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిక్లరేషన్ ఫారంను లోకేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ టీడీపీకి పెనుకొండ కంచుకోటని అలాంటి పెనుకొండలో తిరిగి పూర్వవైభవాన్ని తీసుకొచ్చారని అన్నట్లు సవిత తెలిపారు. టీడీపీకి అత్యధిక మెజార్టీ ఇచ్చిన పెనుకొండ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారన్నారు.. పెనుకొండ రూపురేఖలు మార్చిన ఘనత మనదేనని, మున్ముందు మరింత అభివృద్ధికి సహకరిస్తామని లోకేశ్ పేర్కొన్నారని సవిత తెలిపారు.

## 'కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలి'

**గుడిబండ, జూన్ 10 :** మండలంలోని ఎస్ రాయాపురం గ్రామంలో బియ్యం అందని రేషన్‌కార్డు లబ్ధిదారులకు వెంటనే అందించాలని కార్డుదారులు కోరారు. గ్రామంలోని చౌక ధాన్యపు డిపోల్లో బియ్యం స్టాక్ అయిపోయిందని డీలర్లు చెబుతున్నారని దీంతో బియ్యంకోసం పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ స్టోర్‌కు వెళ్లినా బియ్యం లేవని డీలర్లు, ఎండీయూ ఏజెన్సీలు చెబుతున్నారని వాపోయారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని కార్డుదారులకు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

## డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా షర్ఫుద్దీన్



**ఓబుళదేవరచెరువు, జూన్ 10:** డెమోక్రెటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా షెక్ షర్ఫుద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టుబడి గౌస్‌లాజం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో కార్యదర్శిగా ఓడీసీ మండలానికి చెందిన షేక్ షర్ఫుద్దీన్ ఎన్నికైనట్లు తెలిపారు. ఆయన ఎంపిక పట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంసీ నరసింహులు, సోముశేఖర్‌నాయక్, వెంకటాచలమయ్య, నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

## నారా రోహిత్‌ను కలిసిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


నారా రోహిత్‌తో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

**మడకశిర టౌన్, జూన్ 10:** టీడీపీ తరపున మడకశిర నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని తన గెలుపు కోసం కృషి చేసిన సినీ హీరో నారా రోహిత్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కలిశారు. అదేవిధంగా కామిడీ హీరో సప్తగిరి సైతం మడకశిర నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎంఎస్ రాజు విజయానికి కృషి చేశారు. ఇద్దరినీ నారా రోహిత్ ఇంటిలోనే మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎస్ రాజును సైతం ఇద్దరూ ప్రత్యేకంగా అభినందించారు. తక్కువ సమయంలోనే మడకశిర నియోజకవర్గ అభ్యర్థిగా అందరి మన్ననలు పొంది గెలుపు తీరం అందుకున్నారని అభినందనలు తెలిపినట్లు స్థానిక టీడీపీ నాయకులు తెలిపారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు ఉన్నారు.

## బాబు ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు


చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

**పెనుకొండ టౌన్, జూన్ 10 :** రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ప్రమాణస్వీకారం చేయనున్న సందర్భంగా టీడీపీ స్థానిక నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ప్రమాణ స్వీకారం వేదికను గన్నవరంలో ఏర్పాటు చేస్తున్న విషయం విదితమే. అట్టహాసంగా జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సవిత అభిమానులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు వాహనాల్లో తరలి వెళ్లారు. వారిలో టీడీపీ నాయకులు రఘువీరచౌదరి, అరుణ్‌రెడ్డి, సోము, రామలింగ, ముత్యాల్‌నాయక్, రెడ్డివారి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## చేపల చెరువు వద్ద ఘర్షణ

● పరస్పరం పోలీసులకు ఫిర్యాదు

**కదిరిఅర్బన్, జూన్ 10:** మండలంలోని దేవరచెరువు వద్ద చేపలు పట్టుకునే విషయంపై ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. రూరల్ సీఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు కదిరి పట్టణానికి చెందిన ఇందయతుల్లా, కౌలేపల్లికి చెందిన నారాయణస్వామి ఆదివారం చేపలు పట్టుకునే విషయంపై వాగ్వాదం చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం ఇరుపక్షాలు ఫిర్యాదులు చేశారన్నారు. ఇందయతుల్లాను కౌలేపల్లికి చెందిన నారాయణస్వామి, చంద్ర, మధు, చిరంజీవి, సాంబశివ చేపలు పట్టుకునే విషయంలో వాగ్వివాదం జరిగిందని, చేపలు పట్టవద్దను తనను బెదిరించినట్లు ఫిర్యాదు చేశారు. ఇందాయతుల్లా, నదీం, వజ్రభాస్కర్‌రెడ్డి, అత్తార్‌చాంద్‌బాషా కలిసి నారాయణస్వామిని కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## మూడోసారి మోదీ ప్రధాని కావడంతో సంబరాలు


సంబరాలు చేసుకొంటున్న నాయకులు, కార్యకర్తలు

**మడకశిరటౌన్, జూన్ 10:** ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మొదటి సంతకం చేసి దేశంలోని 9.3 కోట్ల మంది రైతులకు నగదును వారి ఖాతాల్లో జమచేసినందుకు నరేంద్ర మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో రాయలసీమ కిసాన్ మోర్చా ఇన్‌చార్జి చంద్రశేఖర్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ హనుమంతరాయప్ప, టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణతో పాటు పలువురు బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రొళ్ల:** నరేంద్రమోదీ మూడోసారి దేశ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయడంతో రొళ్ల మండలంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. కేక్ కట్‌చేసి, బాణ సంచా పేల్చారు. స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముద్దరాజు, బద్రినాయక్, ఆనంద్‌నాయక్, రామయ్యగౌడ్, పట్టాభిరామ్, టీడీపీ కన్వీనర్ దాసిరెడ్డి, జనసేన కన్వీనర్ రంగస్వామి, ఉమేష్, దాసప్ప, రమేష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, దాసప్ప, నగేష్, తదితరులు పాల్గొన్నారు.


శనిమహాత్మ ఆలయంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకుల పూజలు

## రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

● ఇబ్బంది పడుతున్న ప్రజలు

**గుడిబండ, జూన్ 10 :** ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని మందలపల్లిలో ఆర్ అండ్‌బీ రోడ్డులో వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మందలపల్లిలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు గుంతపడటంతో కురిసిన వర్షం నీరంతా అక్కడికి చేరి నిలిచిపోయింది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అయినా ఆర్ అండ్‌బీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని వర్షం నీరు రోడ్డుపై నిలవకుండా చర్యలు తీసుకోవాలనికోరుతున్నారు.


ఆర్‌అండ్‌బీ రోడ్డులో నిలిచిన వర్షం నీరు

## బాలకృష్ణ పుట్టిన రోజు సంబరాలు

సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, ఆయన అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.



**గోరంట్ల, జూన్ 10:** మండలకేంద్రంలో బాలక్రిష్ణ అభిమాన సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీటీసీ నిమ్మలయువశేఖర్ హాజరై చిన్నారులచే కేక్ కట్ చేయించారు. ఒకరికొక్కరు కేక్ తినిపించుకుని వేడుకలు జరుపుకున్నారు.



**పెనుకొండ రూరల్ :** పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో హిందూపురం ఎంపీ పార్థసారథి అల్లుడు శశిభూషణ్ ఆధ్వర్యంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆ పార్టీ నాయకులు కార్యాలయంలో కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు.



**పెనుకొండ టౌన్:** టీడీపీ నాయకులు పెనుకొండ పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి బాణసంచా కాల్చి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పెద్దఎత్తున నిర్వహించారు. అలాగే పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



**లేపాక్షి :** టీడీపీ మండల కన్వీనర్ జయప్ప ఆధ్వర్యంలో లేపాక్షిలోని బస్టాండు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, బాలకృష్ణ జన్మ దిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు.



**మడకశిరటౌన్:** టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఆవరణంలో కేక్ కట్‌చేసి బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.



**పావగడ :** నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పావగడ పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. బడిపిల్లల సమక్షంలో కేక్‌కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు.

## మాట నిలుపుకున్న ఎమ్మెల్యే

**మడకశిర రూరల్, జూన్ 10:** స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు గౌడనహళ్లి గ్రామస్థులకు ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. మండలంలోని గౌడనహళ్లి గ్రామస్థులు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిల ప్రచారానికి రాజు వెళ్లినప్పుడు ప్రజలు మాట్లాడుతూ... గ్రామంలో తాగునీటి బోరు వేయించాలని కోరారు. తాను గెలుపొందిన వారంలోగా గ్రామంలో తాగునీటి బోరు వేయిస్తానని అప్పుడు ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాజు ఇచ్చిన మాట ప్రకారం తన సొంత డబ్బు రూ.1.50 లక్షలతో గ్రామంలో సోమవారం రాత్రి తాగునీటి బోరు వేయించారు నీరు సమృద్ధిగా పడ్డాయి. గ్రామస్థులు అందరూ ఎమ్మెల్యే రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 15న హాకీ జట్టు ఎంపిక పోటీలు

**అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 10:** స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జిల్లా జట్టు ఎంపిక పోటీలను శనివారం నిర్వహిస్తున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనీల్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పదోతరగతి మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం, క్రీడా సామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 27 నుంచి ధర్మవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని, మరిన్ని వివరాలకు 94900 33474ను సంప్రదించాలని కోరారు.

**16న ఆర్చరీ క్రీడాకారులకు...**

స్థానిక ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో జిల్లా ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఆదివారం ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శివకుమార్ సోమవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 99492 79330ను సంప్రదించాలని కోరారు.

## విధులకు సీడీపీఓ డుమ్మా

**బత్తలపల్లి, జూన్ 10:** ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులు సమయపాలన పాటించడంలేదు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సిన అధికారులు రావడం లేదు. సోమవారం కార్యాలయానికి 10.30 గంటలకు సూపర్‌వైజర్లు రావాలని గ్రూప్‌లో మేసేజ్ పేట్టారు. సూపర్‌వైజర్లు కార్యలయానికి వచ్చారు. అయితే సీడీపీఓ సరస్వతి మాత్రం సాయంత్రం 4 గంటలైనా కార్యాలయానికి రాలేదు. సూపర్ వైజర్లు సాయంత్రం వరకు ఎదురుచూసి ఆమె రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. ప్రభుత్వాలు మారినా అధికారులు సమయపాలన పాటించడం లేదు. దీనిపై ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారిని వివరణ కోరగా బత్తలపల్లి సీడీపీఓ సరస్వతి సెలవు పెట్టలేదని, విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు

**ముదిగుబ్బ, జూన్ 10:** మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్నానంటూ నమ్మించి లైంగికంగా వేధించిన చంద్ర అనే యువకుడిపై బాలిక తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ యతీంద్ర తెలిపారు.